


శివాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కొల్లిపర: శ్రీగంగాపార్వతి సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 511.80 అడుగుల వద్ద ఉంది. ఇది 134.7464 టీఎంసీలకు సమానం.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



పొన్నూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు రమణ, రామశాస్త్రి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు.

న్యూస్‌రీల్

యోగాతో శారీరక రుగ్మతలు దూరం

ఆర్డీఓ కె.మధులత



నరసరావుపేట: యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలని, తద్వారా యోగా ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయడమే దాని ముఖ్యోద్దేశమని ఆర్డీఓ కె.మధులత అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పల్నాడు బస్టాండ్ పెద్ద చెరువురోడ్డు వద్ద ఆదివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో 200 మంది వయో వృద్ధులు పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇది ఆరంభం మాత్రమేనని, ఇక్కడి నుంచి వెళ్లాక ప్రతి రోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయటం ద్వారా శారీరక రుగ్మతల నుంచి దూరం కావటంతో పాటు మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని అన్నారు. బీపీ, మధుమేహం, ఒళ్లు నొప్పులు వంటి శారీర రుగ్మతలకు దూరం కావడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.యశ్వంత్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీ వరకు యోగాంధ్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ మాట్లాడుతూ కార్యక్రమంలో తాము పాలుపంచుకోవటం ఆనందంగా ఉందన్నారు.

దుర్గమ్మ నిత్యానదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందచేశారు. హైదరాబాద్‌వాసి వి.బాలాజి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన ఇ.ఏడుకొండలు కుటుంబం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం వారికి ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

బాలాత్రిపురసుందరికి బంగారు ఆభరణాలు




కూచిపూడి(మొవ్వ): కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్రీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ పసుమర్తి రామలింగ శాస్త్రి, పద్మ దంపతులు (హైదరాబాద్-కూచిపూడి) నాట్యాచార్యుల ఇలవేల్పైన శ్రీ బాలాత్రిపురసుందరి అమ్మవారికి బంగారు ఆభరణాలను ఆదివారం అందజేశారు. దేవాలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణమూర్తి.. అర్చకులు పెనుమూడి సుబ్రహ్మణ్యశాస్త్రికి ఎనిమిది లక్షల రూపాయలు విలువైన రెండు హారాలను, శ్రీ దాసాంజనేయ స్వామికి రూ. 38 వేల విలువైన 108 వెండి తమలపాకుల మాలను అందజేశారు. ఈ సందర్భంగా హారాలను అమ్మవారికి అలంకరింపజేసి పూజా కార్యక్రమాలు చేశారు.

శివాలయం ఉద్యోగి సస్పెన్షన్

పెదకాకాని: శివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కొన్ని సంవత్సరాలుగా ఇల్లా ప్రదీప్‌కుమార్ ఎన్ఎంఆర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల కిందట మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె ఆలయ అధికారికి ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం ప్రదీప్ కుమార్ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు నిర్ధారణ కావడంతో ఆదివారం అతడ్ని శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

పేదల ఇళ్లకు గ్రహణం పట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని పేదల కోసం పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర భూమి ఉచితంగా ఇచ్చారు. పైగా ఇల్లు కట్టుకునేందుకు ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు కూడా మంజూరు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇంత వరకు ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. పేదలంటే సీఎం చంద్రబాబుకు ఎంత చిన్న చూపో మరోసారి ఆయన నిర్దయ వైఖరితో స్పష్టంగా అర్థమవుతోంది.



పేరేచర్లలోని జగనన్న కాలనీ

పేదల ఇంటిపై కూటమి కక్ష

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో గూడు లేక నిరుపేదలకు అవస్థలు
- అటకెక్కిన 'గృహ నిర్మాణం'
- ఏడాదిలో 5,612 మాత్రమే పూర్తి
- జూన్ 12న గృహ ప్రవేశాలంటూ ప్రచారం కోసం హడావుడి
- లక్ష్యంలో సగం కూడా పూర్తి కాకపోయినప్పటికీ ఆర్భాటం
- సకాలంలో బిల్లులు అందక ఇళ్ల నిర్మాణానికి తీవ్ర అడ్డంకులు
- రాజధానిలో ఇచ్చిన వేల ఇళ్ల స్థలాలు నిర్దయగా రద్దు

కూటమి ఏడాదిలో పాలనలో పేదలకు తప్పని వేదన



సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, గుంటూరు గుంటూరు జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 73,804 ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు పచ్చ జెండా ఊపారు. సీఆర్‌డీఏ పరిధిలో కూడా పేదలు ఉండాలనే ఉద్దేశంతో 23,726 ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదనే ఉద్దేశంతోనే కోర్టులో పిటిషన్లు వేసి అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేయించకుండా ఆపేశారు.

గృహ ప్రవేశాల పేరుతో హడావుడి

చేసిందేమీ లేకున్నా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేసేశానని చెప్పుకొనేందుకు సీఎం చంద్రబాబు ఎప్పుడూ తాపత్రయ పడుతుంటారు. అదే కోవలో జూన్ 12వ తేదీన ఆయన ప్రమాణం స్వీకారం చేసి సంవత్సరం కావస్తోందని రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహ ప్రవేశాలు పూర్తి చేయాలంటూ ప్రతి జిల్లాకు లక్ష్యం విధించారు. సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదనే చెప్పుకోవాలి. గుంటూరు జిల్లాలో జూన్ 12వ తేదీ నాటికి 11,049 ఇళ్లు పూర్తి చేయాలని టార్గెట్ ఇచ్చారు. అయితే ఇప్పటికి వరకు జిల్లాలో పూర్తయింది కేవలం 5,612 మాత్రమే. మిగిలినవి ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి.

రాజధానిలో పేదలు ఉండకూడదనే....

ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏర్పాటు చేసిన కలెక్టర్ల సమావేశంలో రాజధానిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేశారు. వారి సొంత గ్రామాల్లోనే స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 50,793 మంది పేదలకు కోర్టులో పోరాడి గెలిచి పట్టాలు ఇచ్చి ఇల్లు కట్టించే ప్రయత్నం చేస్తే... వాటిని చంద్రబాబు అడ్డుకున్న సంగతి తెలిసిందే. సామాన్యుడికి రాజధానిలో ఇళ్లు కట్టుకోవడానికి భూములు కూడా ఇవ్వలేనప్పుడు ఇది ప్రజా రాజధాని ఎలా అవుతుందని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అమరావతిలో పేదవాడికి భూమి ఇచ్చినప్పుడు 'సెంటు కంపు' అని పచ్చ పత్రికల్లో రాయించి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కోర్టుల్లో వాదించారు. ఇప్పుడు ఏకంగా వారిని అక్కడి నుంచి పంపించి వేయడానికే కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై బాధితులు కోర్టును ఆశ్రయించారు. సీఆర్డీఏ పరిధిలో 25 లే అవుట్లలో విద్యుత్ సదుపాయాలకు రూ.326.51 కోట్లు, ఇళ్ల నిర్మాణాల కోసం తాత్కాలిక నీటి సరఫరా కొరకు రూ.31.79 కోట్లు, అనుసంధాన రహదారుల ఏర్పాటు కోసం రూ.7.61 కోట్లతో పనులు మొదలుపెట్టారు. పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18, సుప్రీంకోర్టులో ఐదు కేసులు వేశారు. తాజాగా రాజధాని ప్రాంత గ్రామాల రైతు సంక్షేమ సంఘాలు, రాయపూడి దళిత బహుజన సంక్షేమ ఐకాస పేరుతో హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. వీటిని విచారించి ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత ఏడాది ఆగస్టు నుంచి ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఏకంగా వారికి ఇచ్చిన పట్టాలు రద్దు చేసి సొంత గ్రామాల్లోనే ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు కూటమి తీరుతో ఆవేదన చెందుతున్నారు.

జగనన్న ఇచ్చిన స్థలం నేడు రద్దు

జగనన్న ఇంటి పట్టా ఇస్తే ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ఆ పట్టా రద్దు చేశారు. కూలీ పనులకు వెళితేనే ఇల్లు గడుస్తుంది. ఇద్దరు పిల్లలకు గతంలో అమ్మ ఒడి పథకం ద్వారా డబ్బులు ఇచ్చారు. ఏడాది కాలంగా ఆ డబ్బులు కూడా రాలేదు. ఇంటి అద్దె నెలకు రూ.మూడు వేలు చెల్లించాల్సి వస్తోంది. స్థలం ఇస్తే అద్దె బాధ తప్పుతుందని ఎదురుచూస్తున్నాం. ఇచ్చిన స్థలం కూడా రద్దు చేయడం దారుణం. ఏ ఎంక్వైరీ చేసినా ఎక్కడా ఎటువంటి ఆస్తులు లేవు. ఉండటానికి ఇల్లు కూడా లేదు. పేదోళ్లకు ఇంటి స్థలం రావడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదు.



– షేక్ రిజ్వానా, పెదకాకాని

అద్దె కట్టలేక అవస్థలు

ఇంటికి అద్దె కట్టలేక అల్లాడుతున్నాం. ఎక్కడ ఇంటి స్థలం ఇస్తే అక్కడకు వెళతాం. కానీ కూటమి ప్రభుత్వంలో పాలకులు ఇవ్వరు.. ఇచ్చేవారిని ఇవ్వనీయరు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇళ్ల స్థలాలు ఇస్తారని ఎదురు చూశాం. ఒక్కరికి కూడా పట్టా రాలేదు. నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నవులూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆ రోజే స్థలాలు కూడా చూపించారు. ఇల్లు కట్టుకుంటే అద్దె బాధలు తప్పుతాయని సంతోషించాం. కూటమి సర్కారు వచ్చాక రాజధానిలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు రద్దు చేశామన్నారు. ఇప్పుడు ఇంటి స్థలం ఇస్తారో, లేదో?



– తుమ్మా నీలు, అగతవరప్పాడు

రోడ్డు పక్కనే గుడిసెలో ఉంటున్నాం

రహదారి పక్కన గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాం. తెనాలి నందివెలుగు రోడ్డు విస్తరణకు సహకరించి, రోడ్డుకు రెండు పక్కల ఉండే వారందరం ఆరు అడుగుల స్థలాన్ని ఇచ్చాం. మా ఇళ్లను ఆనుకుని రేయింబవళ్లు లారీలు, బస్సులు వంటి పెద్ద వాహనాలు అతి వేగంగా తిరుగుతున్నాయి, ఎప్పుడు ఏ వాహనం అదుపు తప్పి మా గుడిసెలోకి దూసుకొస్తుందోనని భయంగా ఉంది. మేం నివాసం ఉండే గుడిసెలకు ఒక పక్క మురుగు కాలువ, మరో పక్కన నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. మా బాధలు అర్థం చేసుకుని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నాం.



– కగ్గా సుధారాణి, తక్కెళ్ళపాడు



లే అవుట్ల స్వాధీనానికి యత్నం?

గత ప్రభుత్వం గుంటూరు జిల్లాలో రెండు వందలకుపైగా లే అవుట్స్ ఏర్పాటు చేసింది. అక్కడ ఇళ్ల నిర్మాణాలు దశలవారీగా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించింది. మొదటి దశ కింద గుంటూరు జిల్లాలో 73,804 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిని మాత్రమే కూటమి ప్రభుత్వం పూర్తి చేసి ఆ తరువాత మిగిలిన లే అవుట్లను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఏపీ ఈఏపీసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ఇంజినీరింగ్‌లో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించిన గుంటూరు విద్యార్థి



తెలగతోటి విక్రమ్ లెవీ (ఇంజినీరింగ్ ఆరో ర్యాంకు)

గుంటూరు ఎడ్యుకేషన్: కాకినాడ జేఎన్‌టీయూ ఆదివారం ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఫలితాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గత నెల 18 నుంచి 27వ తేదీ వరకు జరిగిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్) ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో గుంటూరు నగరానికి చెందిన తెలగతోటి విక్రమ్ లెవీ 6వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. గుంటూరులోని భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీలో చదివిన విక్రమ్ లెవీ టెన్త్, ఇంటర్మీడియెట్ స్థానికంగానే చదివాడు. విద్యార్థి తండ్రి పిచ్చయ్య విజ్ఞాన్ యూనివర్సిటీలో సీఎస్ఈ విభాగ ప్రొఫెసర్ కాగా.. తల్లి ఇవాంజిలిన్ విజయవాడలోని మేరీ స్టెల్లా కళాశాలలో అధ్యాపకురాలు. విద్యార్థులందరూ కంప్యూటర్ సైన్స్‌ను ఎంపిక చేసుకుంటుండగా, అందుకు భిన్నంగా విక్రమ్ లెవీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌ను ఎంపిక చేసుకున్నాడు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరీలో 146వ ర్యాంకు కైవసం చేసుకున్న విక్రమ్ లెవీ ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో చేరేందుకు ఆప్షన్ నమోదు చేసుకున్నాడు. స్టార్టప్ కంపెనీ ప్రారంభించే లక్ష్యంతో ఉన్న విక్రమ్ లెవీ పరిశోధనల దిశగా ముందుకు వెళ్లాలనే కోరికను వెలిబుచ్చాడు.

ఇంజినీరింగ్ టాప్-100లోపు ర్యాంకర్లు వీరే

గుంటూరులోని వేంకటేశ్వరకాలనీకి చెందిన అంబటి నోషిక్ సాయి 25వ ర్యాంకు, నరసరావుపేట విద్యార్థి కల్లూరి శ్రీరాఘవ - 46, గుంటూరు ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన విన్నకోట మహేష్ చంద్ర - 56, తెనాలికి చెందిన నల్లా శాన్వి సాయి వీర - 67, తాడేపల్లికి చెందిన గుమ్మడిదల హేమంత్ సాయిరామ్ - 76, గుంటూరుకు చెందిన గుత్తికొండ సాయి మనోజ్ఞ - 98, చందులూరి నాగ వెంకట నీరజ్ - 99, గుంటూరు రూరల్ గొర్లవారిపాలెంకు చెందిన నల్లపనేని సుజిత్ 100వ ర్యాంకు సాధించారు.

అగ్రికల్చర్, ఫార్మసీలో...

అగ్రికల్చర్, ఫార్మసీ టాప్-100 ర్యాంకర్లలో గుంటూరు కొత్తపేటకు చెందిన పసుపులేటి రుద్ర శ్రీ గణేష్ 15వ ర్యాంకు, సత్తెనపల్లికి చెందిన కటకం ఏకేఎన్ హరి కిరణ్ -16, గుంటూరు కొరిటెపాడుకు చెందిన ఉమా శంకర్ తారిక శ్రీ - 28, అమరావతి రోడ్డుకు చెందిన కారుమంచి విక్రాంత్ -32, గుజ్జనగుండ్లకు చెందిన ఉప్పాల రూపశ్రీ - 40, కొలకలూరుకు చెందిన గుమ్మడిదల తేజాస్ - 54, చంద్రమౌళీనగర్‌కు చెందిన వేముల అన్విత్ చేతన్ - 67, శ్రీనగర్‌కు చెందిన ఓగిబెయిన సుష్మ కౌస్తుభరాణి - 96, పొన్నూరుకు చెందిన కూరాకుల శ్రీరామ్ యాదవ్ - 97, గుంటూరు విజయపురికాలనీకి చెందిన గుంటుపల్లి శ్రీలేఖ 110వ ర్యాంకు సాధించారు.

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా నుంచి ఇంజినీరింగ్‌కు హాజరైన 8,944 మంది విద్యార్థుల్లో 6,095, అగ్రి,ఫార్మసీలో 1,802 మంది విద్యార్థుల్లో 1,652 మంది ఉత్తీర్ణులయ్యారు.

మధుసూదనరెడ్డికి 200 ర్యాంక్..

మండలంలోని రంగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏరువ మధుసూదనరెడ్డి ఇంజినీరింగ్ విభాగంలో 200 ర్యాంక్ సాధించాడు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో చేరనున్నట్లు మధుసూదనరెడ్డి తెలిపాడు.

సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: ఏపీ ఈఏపీసెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యార్థులు సత్తా చాటారు. సత్తెనపల్లి గాంధీ చౌక్ సమీపంలోని భవిరిశెట్టి వారి స్ట్రీట్‌కు చెందిన కటకం వెంకట నాగ సర్వేశ్వరరావు, శిరీష దంపతుల కుమారుడు కటకం అనంత కోటి నాగ హరికిరణ్ జిల్లా స్థాయిలో 16వ ర్యాంకు సాధించాడు. సత్తెనపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గజ్జల నాగ భూషణ్ రెడ్డి, డాక్టర్ గజ్జల శారదారెడ్డి దంపతుల కుమారుడు సాయి కౌశిక్ రెడ్డి 82వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామానికి చెందిన రైతు వద్దుల వెంకటరెడ్డి, పద్మ దంపతుల కుమారుడు వద్దుల హంద్రీ రామ్‌రెడ్డి 89వ ర్యాంకును సాధించాడు. ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ చేయడమే తమ లక్ష్యంగా చెప్పారు.



నాగ హరికిరణ్



సాయి కౌశిక్‌రెడ్డి



హంద్రీరామ్‌రెడ్డి



మధుసూదనరెడ్డి

పాలకుల తీరుపై ఉపాధ్యాయుల కన్నెర్ర

- బదిలీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం
- ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ బదులు మాన్యువల్‌గా చేయాలని డిమాండ్
- గుంటూరు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ముట్టడి
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి భారీగా తరలివచ్చిన ఉపాధ్యాయులు



మాన్యువల్ కౌన్సెలింగ్‌కు డిమాండ్ చేస్తూ నినదిస్తున్న ఐక్యవేదిక నాయకులు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: తమ న్యాయమైన డిమాండ్లకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు తిరుగుబాటు చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)ల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించేందుకు మొండి వైఖరి ప్రదర్శిస్తున్న ప్రభుత్వ తీరుపై నిరసనగళం వినిపించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వెబ్ వద్దు... మాన్యువల్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అప్రమత్తమైన పోలీసులు భారీగా మోహరించారు. బారికేడ్లను అడ్డుగా పెట్టిన ఉపాధ్యాయులను నిలువరించే ప్రయత్నం చేశారు.

మాట తప్పిన కూటమి ప్రభుత్వం

ఈ సందర్భంగా ముట్టడికి నేతృత్వం వహించిన ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ... ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపిన సమయంలో ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. ప్రస్తుతం ఎంఈవోల ద్వారా సమాచారాన్ని పంపి, బలవంతంగా వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెబ్ విధానంలో ఒక్కో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు 3 వేలకుపైగా ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉండటం వల్ల మానసిక ఆందోళనకు గురి అవుతారన్నారు. వెబ్ ఆప్షన్లలో వేల సంఖ్యలో పాఠశాలలను ఎంపిక చేసుకోవడం కష్టసాధ్యం కావడంతోనే మాన్యువల్‌లో నిర్వహించేందుకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు హడావుడిగా వెబ్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారని మండిపడ్డారు.

ఉపాధ్యాయులను మోసగించారు

ఐక్యవేదిక నాయకులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులను మోసగించిన ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఈ ఆందోళన జరిగిందన్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకతను స్పష్టంగా చాటారని అన్నారు. ఒక పక్క మంచి ప్రభుత్వమని చెప్పుకొంటూ, మరోవైపు ఉపాధ్యాయులను మోసగించడం సరైన విధానం కాదన్నారు. తక్షణం విద్యాశాఖ మంత్రి లోకేష్ జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డి.పెద బాబు, ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ తక్కువ సంఖ్యలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌లో అనేక తప్పులు జరిగాయని తెలిపారు. సీనియార్టీ జాబితాల్లో తప్పులు రావడమే కాకుండా 50 ఆప్షన్లు నమోదు చేసుకునేందుకే రెండు గంటలకుపైగా సమయం పట్టిందన్నారు. ఇక రెండు వేల నుంచి మూడు వేల సంఖ్యలో ఆప్షన్లు నమోదుకు గంటల కొద్దీ సమయం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎటువంటి ఆర్థిక భారం లేని బదిలీలను ఉపాధ్యాయులు కోరుకున్నట్లు చెప్పారు. ఇలా నిరంకుశంగా వ్యవహరించడం వలన ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. అధికారుల మాటలు విని వేలాది మంది ఉపాధ్యాయుల మనోభావాలతో ఆడుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు.



గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం గేటు వద్ద పోలీసులు

అవసరమైతే విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి

ఐక్యవేదిక నాయకులు మక్కెన శ్రీనివాసరావు, సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబులు మాట్లాడుతూ.. నిరంకుశ అధికారులను నిలువరించి, మాన్యువల్ కౌన్సెలింగ్ పెడతామని ఇచ్చిన హామీ అమలు చేయని పక్షంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉదయం 10 గంటల నుంచి ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులు మూడున్నర గంటలపాటు ఎండను సైతం లెక్కచేయకుండా కొనసాగించారు. అధికారులను, సిబ్బందిని డీఈవో కార్యాలయంలోనికి వెళ్లనివ్వలేదు. అనంతరం ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ప్రకటించే కార్యాచరణకు అనుగుణంగా ముందుకు వెళతామని చెప్పి తాత్కాలికంగా విరమించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఐక్య వేదిక నాయకులు డీకే సుబ్బారెడ్డి, మొహమ్మద్ ఖాలీద్, కె.నరసింహారావు, సంపత్ బాబు, సోషలిజం, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రజిత్, ఎండీ ఉస్మాన్, టి.మోహనరావు, రామకృష్ణ, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, సాంబయ్య, పెద్ద సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరసనలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయురాలు

క్లుప్తంగా

జిల్లాలో 38.8 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: జిల్లాలో అడపా తడపా అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 38.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు వెల్లడించారు. గత మే నెల 25తో ప్రారంభమైన రోహిణీ కార్తె ఈనెల ఎనిమిదవ తేదీతో గుడ్‌బై చెప్పింది.. అయితే నాలుగైదురోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. ఇంకా ఎండలు కొనసాగే అవకాశం కన్పిస్తుంది. అత్యధికంగా మాచవరంలో 10.4 మి.మీ, అమరావతిలో 8.4 మి.మీటర్ల వర్షం కురిసింది. బొల్లాపల్లిలో 2.4, వినుకొండలో 4.8, ఈపూరులో 5.2, క్రోసూరులో 1.8, వెల్దుర్తిలో 5.0 మి.మీ వర్షం కురిసింది. కాగా ఈనెలలో గడిచిన ఎనిమిదిరోజుల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాల పరిధిలో సాధరణ వర్షపాతం 584.6 మి.మీటర్ల వర్షం కురవాల్సివుండగా కేవలం 62.4 మి.మీటర్ల మాత్రమే నమోదైంది. జిల్లా కేంద్రమైన నరసరావుపేటతో పాటు చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, రొంపిచర్ల, శావల్యాపురం, నూజెండ్ల, నకరికల్లు, రాజుపాలెం, సత్తెనపల్లి, పెదకూరపాడు, అచ్చంపేట, బెల్లంకొండ, పిడుగురాళ్ల, కారంపూడి, దాచేపల్లి, గురజాల, రెంటచింతల, మాచర్ల మండలాల్లో ఇప్పటి వరకు వర్షం నమోదు కాలేదు.

బాలికతో యువకుడి అసభ్యప్రవర్తన

వినుకొండ: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి ఆమె కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన వినుకొండ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఆదివారం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అప్పడే ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గుర్తించి యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



నకరికల్లు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నకరికల్లులోని ఇనిమెట్ల రోడ్డులో ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన చందా మీరావలి(38) నకరికల్లులోని ఇనిమెట్ల రోడ్డులో గల మద్యం దుకాణం వద్ద అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ చల్లా సురేష్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు కొన్ని రోజులుగా మద్యం మత్తులో తిరుగుతున్నాడని.. ఆదివారం కూడా మద్యం తాగేందుకు నకరికల్లు వచ్చినట్లు సమాచారం. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఐఐటీలో సీటే లక్ష్యం.. ‘నీట్’పైనే గురి

- ఏపీ ఈఏపీ సెట్ ఉత్తమ ర్యాంకర్ల భావి ప్రణాళికలు
- గుంటూరు జిల్లా నుంచి అత్యుత్తమ ర్యాంకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్‌లో గుంటూరు జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగంలో సత్తా చాటిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో ఇంజినీరింగ్ విద్య అభ్యసించే లక్ష్యంతో ఉండగా, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు నీట్‌లో సాధించే ర్యాంకు ఆధారంగా దేశంలోని ప్రతిష్టాత్మక వైద్య విద్యాసంస్థలతో పాటు వివిధ మెడికల్ కళాశాలల్లో వైద్యవిద్య అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి టాప్-100లో సత్తా చాటిన విద్యార్థులందరూ ఐఐటీల్లో ప్రవేశం కోసం అఖిల భారతస్థాయిలో జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరై టాప్ ర్యాంకులు సాధించారు. అదే విధంగా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో టాప్-100లో ర్యాంకర్లుగా నిలిచిన విద్యార్థులు నీట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

బెంగళూరు ఐఐఎస్సీలో చేరతా..



మా స్వస్థలం గుంటూరు. నాన్న కిషోర్ చౌదరి ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తుండగా, అమ్మ పద్మజ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటర్‌గా పని చేస్తున్నారు. జేఈఈ మెయిన్స్‌లో 100 పర్సంటైల్‌తో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్ సాధించిన 152వ ర్యాంకు ఆధారంగా బెంగళూరు ఐఐఎస్సీలో బీటెక్‌లో మాథమాటిక్స్ ఇన్ కంప్యూటర్స్ కోర్సులో జాయిన్ అవుతాను.

– గుత్తికొండ సాయిమనోజ్ఞ, 98వ ర్యాంకు, ఇంజినీరింగ్

బెస్ట్ ఐఐటీలో సీఎస్ఈ చదువుతా..



మా స్వస్థలం గుంటూరు నగరంలోని ముత్యాలరెడ్డినగర్. నాన్న వీర వరప్రసాదరావు పొన్నెకల్లు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు. అమ్మ రాజ్యలక్ష్మి ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వచ్చిన 391వ ర్యాంకు ఆధారంగా ఏదైనా బెస్ట్ ఐఐటీలో సీఎస్ఈ చదవాలని ఉంది.

– విన్నకోట మహేష్‌చంద్ర, 56వ ర్యాంకు, ఇంజినీరింగ్

ముంబై ఐఐటీలో సీటు సాధిస్తా..



మా స్వస్థలం తెనాలి. నాన్న సతీష్‌కుమార్ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. అమ్మ సరోజ గృహిణి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వచ్చిన 712వ ర్యాంకు ఆధారంగా ముంబై, చెన్నై, ఢిల్లీ ఐఐటీల్లో సీఎస్ఈలో చేరతాను.

– నాళ్ల శాన్వీ సాయి వీర, 67వ ర్యాంకు, ఇంజినీరింగ్

ఐఐటీలో సీటే లక్ష్యం



మా స్వస్థలం నరసరావుపేట. నాన్న శ్రీనివాసరావు, అమ్మ మాధవి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన 340వ ర్యాంకు ఆధారంగా ఖరగ్‌పూర్, ఢిల్లీ ఐఐటీల్లో సీఎస్ఈలో చదవాలనే లక్ష్యంతో ఉన్నాను.

– కల్లూరి శ్రీ రాఘవ, 46వ ర్యాంకు, ఇంజినీరింగ్

గైనకాలజీ వైద్యురాలిని అవుతా..



మాస్వస్థలం గుంటూరులోని గుజ్జనగుండ్ల. నాన్న రవికిరణ్ విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్, అమ్మ మధురిమ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలు. నీట్‌లో వచ్చే ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్‌లో చేరతాను. పీజీ పూర్తి చేసి గైనకాలజీ నిపుణురాలిగా ఎదగాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఉప్పాల రూపశ్రీ, 40వ ర్యాంకు, అగ్రికల్చర్, ఫార్మసీ

వైద్య వృత్తే లక్ష్యం



మా స్వస్థలం విద్యానగర్. నాన్న డాక్టర్ ఉమా శంకర్ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్, అమ్మ స్వతంత్ర పెథాలజిస్టుగా లలితా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. నీట్‌కు సన్నద్ధం కావడంలో అధ్యాపకుల సూచనలతో పాటు తెలుగు అకాడమీ పుస్తకాలు దోహదం చేశాయి. నీట్ ర్యాంకు ఆధారంగా అమ్మానాన్న బాటలో వైద్యవృత్తిని చేపట్టాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఉమా శంకర్ తారిక శ్రీ, 28వ ర్యాంకు, అగ్రికల్చర్, ఫార్మసీ

జాతీయస్థాయి వైద్యవిద్యాసంస్థలో సీటు సాధిస్తా..



మా స్వస్థలం అమరావతి రోడ్డులోని భారత్‌పేట. నాన్న భానుప్రకాష్ గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా పని చేస్తుండగా, అమ్మ విజయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకురాలు. నీట్‌లో సాధించే ర్యాంకు ఆధారంగా జాతీయస్థాయి వైద్యవిద్యాసంస్థలో సీటు సాధిస్తాను

– కారుమంచి విక్రాంత్, 32వ ర్యాంకు, అగ్రికల్చర్, ఫార్మసీ

రైస్‌మిల్లులో రేషన్ బియ్యం పట్టివేత

- 498 బస్తాలు స్వాధీనం
- మిల్లు యజమానిపై కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ రైస్‌మిల్లుపై సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు దాడిచేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం పెదవడ్లపూడి గ్రామంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం ప్రాసెసింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చింది. మంగళగిరి సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాసరావు గుంటూరు ఈస్ట్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ డి.భాస్కరరావు, పెదవడ్లపూడి వీఆర్‌వో కుమార్‌బాబులు తమ సిబ్బందితో రైస్‌మిల్లులో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 50 కిలోలు గల తెల్ల గోతాల్లో ఫోర్టిఫైడ్ గింజలు కలిసి ఉన్నట్లు గుర్తించిన అధికారులు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. 373 రంగు గోతాల్లో ఉన్న 40 కిలోల బ్యాగ్‌లను, 125 తెల్ల గోతాల్లో ఉన్న 50 కిల్లో బ్యాగ్‌లను పీడీఎస్ రైస్‌గా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 21.170 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని భద్రతా నిమిత్తం తేజస్వి ట్రేడర్స్‌కు తరలించారు. అందులో కొన్ని బియ్యం తీసి పరీక్ష నిమిత్తం డీఎం సివిల్ సప్లయిస్ గుంటూరు వారికి పంపించారు. రైస్‌మిల్లు నిర్వాహకుడు ప్రసాద్‌పై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేయడంతో పాటు అతనిపై క్రిమినల్ కేసు కూడా నమోదు చేయాలని మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకి సిఫార్సు చేశారు.

కేసుల విషయంలో...

సుమారు 50 టన్నులు పీడీఎస్ బియ్యం తనిఖీల్లో బయట పడినట్లు, కానీ అందులో 21.170 టన్నులు మాత్రమే కేసులో పొందుపరిచినట్లు విశ్వసనీయ సమాచారం. రైస్‌మిల్లులో పీడీఎస్ రైస్‌ను కిలోకి రూ.40 చొప్పున అమ్ముతారని, ఇవి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తారని సమాచారం. గతంలో కొన్ని నెలల క్రితం ఈ రైస్‌మిల్లుకు చెందిన యజమాని బంధువు రైస్ మిల్లు కూడా అధికారులు సీజ్ చేశారు. పేదల బియ్యంతో భారీగా కాసులు కురిపించుకుంటున్న వ్యాపారులు ఎన్ని పర్యాయాలు పట్టుకున్నప్పటికీ అక్రమ వ్యాపారాన్ని ఆపడం లేదంటే ఇందుకు జిల్లా స్థాయి అధికారులు, పలువురు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందరి సహకారంతో సత్రం అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, యర్రం
- కోటప్పకొండలో రెడ్ల సత్రం సిల్వర్ జూబ్లీ వేడుకలు
- దాతలకు ఘన సన్మానం



గదుల నిర్మాణ దాతలను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, యర్రం

నరసరావుపేట రూరల్: దాతలు, సభ్యుల సహకారంతోనే కోటప్పకొండ రెడ్ల సత్రం అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటప్పకొండలోని యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రెడ్ల సత్రం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం సత్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, యర్రం వెంకటేశ్వరరెడ్డిలు హాజరయ్యారు. సత్రంలో నూతనంగా నిర్మించనున్న భోజనశాల, గదుల నిర్మాణ పనులకు అతిథులు శంకుస్థాపన చేశారు. అనంతరం 2001లో సత్రం నిర్మాణ పనులను ప్రారంభించినప్పుడు సభ్యులుగా ఉన్న 49 మందిని, సత్రంలో గదుల నిర్మాణానికి సహకరించిన 98మంది దాతలను సన్మానించారు. భోజనశాల, గదుల నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతలను అతిథులు సన్మానించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ సత్రం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సత్రం అభివృద్ధికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. సంఘీయులు అందరి సహకారంతో సత్రంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. సత్రం కమిటీలు విరాళాలు సేకరణకు విశేష కృషి చేశాయని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే యర్రం మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రం కోటప్పకొండలో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు సత్రం విశేష సేవలు అందిస్తుందని తెలిపారు. కులాలకతీతంగా వృద్ధాశ్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సత్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు భవనం రాఘవరెడ్డి, అధ్యక్షుడు కంజుల వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొలిమేర వెంకటరెడ్డి, కోశాధికారి మాగులూరి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు గంటా నరసింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నపూస జోసఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించి శాంతి చర్చలు జరపాలి

- డిమాండ్ చేసిన వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు
- సీపీఎం కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: మావోయిస్టులు చలం, భాస్కర్ మృతదేహాలను బంధువులకు అప్పగించి ఆ పార్టీతో శాంతి చర్చలు జరపాలని వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కోటప్పకొండరోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ కోలా నవజ్యోతి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మధ్యభారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఎన్‌కౌంటర్లు నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కగార్ పేరుతో మావోయిస్టులను చంపడం సరైంది కాదన్నారు. వారు చర్చల కోసం ముందుకు వస్తే ఆ పనిచేయకుండా కాల్చి చంపి శవాలు కూడా ఇవ్వకపోవడం ఏరకమైన ప్రజాస్వామ్యమో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంశాఖా మంత్రి అమిత్ షా చెప్పాలని అన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, మృతదేహాలను తక్షణమే కుటుంబ సభ్యులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను చంపడం చట్ట వ్యతిరేకమని, తమ పార్టీ మొదటి నుండి వ్యతిరేకిస్తుందన్నారు. శవాలు ఇస్తే తాము చేసిన చిత్రహింసలు ఎక్కడ బయట పడతాయోనని ఇవ్వట్లేదని, తక్షణమే ఇటీవల ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన చర్చిల సుధాకర్ మృతదేహాన్ని బంధువులకు ఇవ్వాలని కోరారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.అంజమ్మ, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కో-కన్వీనర్ డి.సుధాకర్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతే ప్రతిఒక్కరి లక్ష్యం కావాలి



ప్రపంచ ప్రార్థన దినోత్సవ ప్రార్థనల్లో దైవసేవకులు

- ఘనంగా ప్రపంచ ప్రార్థన దినోత్సవం
- నియోజకవర్గ దైవసేవకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన
- గత 50 రోజులుగా ఉదయకాల ప్రార్థనలు

చిలకలూరిపేటటౌన్: ప్రపంచ ప్రార్థనల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణం భక్తి శోభతో అలముకున్నది. ప్రతిరోజూ ఉదయాన్నే గత 49 రోజులుగా నిరంతరంగా అన్ని చర్చిలలో జరుగుతున్న ప్రార్థనలు నిర్వహించగా, ఆదివారం 50వ రోజుతో ఘనమైన ముగింపు ఏర్పడింది. ప్రత్యేక ప్రార్థనలతో ప్రపంచ ప్రార్థనల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు పాస్టర్ ఎంఎస్ మూర్తి (సూరిబాబు) అధ్యక్షతన జరిగిన ఈ ప్రార్థనల్లో నియోజకవర్గానికి చెందిన వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వశాంతి నెలకొనాలని, భారతదేశం ఐక్యంగా వర్ధిల్లాలని, శాంతి, భద్రతల వాతావరణం నిరంతరం కొనసాగాలని వారు ప్రార్థించారు. దేశాభివృద్ధికి మానవీయ విలువలు అనుసరణీయమవ్వాలన్న ఆకాంక్షను ప్రార్థనల ద్వారా వెలిబుచ్చారు. ప్రార్థనలు ముగిశాక, సంఘీభావానికి ప్రతీకగా ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ప్రార్థనల్లో పాస్టర్లు ఎంఎస్ మూర్తి, ఎస్ థామస్, జి బుజ్జి, బసికాపురం అబ్రహం, టీ క్రీస్తురాజు, ఎం మోషే, ఎస్ అబ్రహం, బి సుబ్బారావు, డి జీవరత్నం, ఎన్ వసురాజు, పాల్‌సారధి, ఎస్ డేవిడ్, ఎస్ దావీదురాజు, విజయమేరీ నక్షత్రం, ఎం జ్ఞానయ్య, సతీష్ కుమార్, ఎం సంసోను, కె శాంతిసాగర్, కోటి వీరయ్య, అన్నామణి, శారా, విజయ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ ముసుగులో ద్విచక్ర వాహనాలు చోరీ

- ఇద్దరు బైక్ చోరీల నిందితులు అరెస్టు
- 22 వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ భానోదయ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భానోదయ

గుంటూరు రూరల్: చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్న ఇరువురిని నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల గ్రామానికి చెందిన పరిమిశెట్టి లక్ష్మణ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతనికి పాతగుంటూరుకు చెందిన పాత నేరస్తుడు బైక్ మెకానిక్‌గా పనిచేసే చల్లా అంజిబాబు పరిచయమయ్యాడు. దీంతో ఇరువురు కలిసి సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలను చోరీ చేయటం ప్రారంభించారు. ఇరువురు పాత నేరస్తులే.. గుట్టు చప్పుడు కాకుండా ఆసుపత్రులు, పార్కులు, ఇతర రద్దీగా ఉండే ప్రదేశాల్లో పార్కింగ్ చేసే వాహనాలను, తాళాలు వేయని వాహనాలను గుర్తించి చోరీలకు పాల్పడేవారు. ఈక్రమంలో ఈనెల 1వ తేదీన గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులోని విజయశ్రీ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఇరువురు చోరీ చేశారు. బాధితుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను ఆదవారం నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నిందితులు చేసిన నేరాలను ఒప్పుకున్నారు. నిందితులు 2012 నుంచి నేర ప్రవృత్తిని కలిగి ఉన్నారని విచారణలో తెలిందన్నారు. నిందితుల వద్దనుంచి రూ.13లక్షల విలువ చేసే 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు చేధించటంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్ఐ జనార్ధన్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టుకు అప్పగించారు.

వడ్డీముక్కల వీఆర్‌ఓపై లైంగికదాడి కేసు

పొన్నూరు: మండలంలోని వడ్డీముక్కల గ్రామ వీఆర్‌ఓపై లైంగికదాడి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీహరి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన ఓ మహిళ వడ్డిముక్కల గ్రామ రెవెన్యూ అధికారి రుద్రపాటి మహేష్‌కు రూ. 25 లక్షలు అప్పుగా ఇచ్చింది. అయితే తనవద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని మహేష్‌ను అడగ్గా, డబ్బులు ఇస్తానని చెప్పి ఒక చోటికి పిలిచి వీఆర్‌ఓ రుద్రపాటి మహేష్ తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయంలో మరో ఐదుగురు తనను దుర్భాషలాడారని పేర్కొంటూ తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు లైంగికదాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రేష్టి వర్మపై ‘మా’ అధ్యక్షుడికి ఫిర్యాదు



మా అధ్యక్షుడు మంచు విష్ణుకు ఫిర్యాదు చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం

లక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటలు చేసిన దేశ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. గుంటూరు నగరంలోని శనివారం జరిగిన కన్నప్ప ప్రీ రిలీజ్ కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరానికి విచ్చేసిన మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణును కలిసిన కరీం ఈమేరకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సినీ కొరియోగ్రాఫర్‌గా ఉన్న శ్రేష్టి వర్మ జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూలను కించపరుస్తూ మాట్లాడారన్నారు. స్టార్ హీరోలను సైతం కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న శ్రేష్టి వర్మ పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంచు విష్ణు, విచారించి, ఏడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

13న న్యాయవాదుల సమావేశం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన జేకేసీ కళాశాల రోడ్డులోని వికాస్ ఇన్ హోటల్‌లో న్యాయవాదుల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పలు కీలకమైన అంశాల గురించి సమావేశంలో చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మలసాని మనోహర్‌రెడ్డి, మాజీ అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, పార్టీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్, విజయవాడ పార్లమెంట్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి

ముగ్గురికి గాయాలు



దుగ్గిరాల: ఎదురెదురుగా వస్తున్న ద్వి చక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం చిలువూరు దగ్గర సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్తలూరు మండలం, ప్యాపర్రు గ్రామానికి చెందిన కొల్లూరి వీరాంజనేయులు(35) గుంటూరులో ఎల్రక్టీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. గుంటూరు వెళ్లి తిరిగి వస్తుండగా దుగ్గిరాల మండలం చిలువూరు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఘటనలో వీరాంజనేయులు తలకు తీవ్ర గాయమై, రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్‌పై తీవ్రంగా గాయపడిన రాయపూడి డేవిడ్‌ను చికిత్స నిమిత్తం ఎయిమ్స్‌కు, మరో ఇద్దరు క్షతగాత్రులను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. మృత దేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.